## ఈ నెల 31న మండల సర్వసభ్య సమావేశం

తిర్యాణి, జనవరి 28: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈనెల 31న బుధవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సత్యనారాయణ సింగ్ తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు తమ ప్రగతి నివేదికలతో సకాలంలో హాజరై సహకరించాలని కోరారు.

## నేడు తైబజార్ ప్లాట్లు వేలం

రెబ్బెన, జనవరి 28: రెబ్బెన మండలం గంగాపూర్ గ్రామ శివారులో కొలువైన శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి జాతర ఫిబ్రవరిలో జరగనున్న నేపథ్యంలో తైబజార్ ప్లాట్ల కోసం సోమవారం వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో బాపురెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తైబజార్ వేలంలో పాల్గొనేందుకు రూ. 20 వేలు డిపాజిట్ సొమ్ము చెల్లించాలని తెలిపారు. తైబజార్ ప్లాట్లు దక్కించుకున్న వారు ఈ ఫిబ్రవరి 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 31వరకు కాల పరిమితి ఉంటుందని పేర్కొన్నారు.

## సామాజిక సేవలో ముందుండాలి



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎస్ఐ, ఆర్ఎంపీలు

బెజ్జూర్, జనవరి 28: ఆర్ఎంపీ, పీఎంపీలు సామాజిక సేవలో ముందుండాలని ఎస్ఐ విక్రమ్ సూచించారు. మండల ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేదలు అనారోగ్యానికి గురైతే, తొలుత ఆర్ఎంపీల వద్దకే వస్తుంటారని, జాగ్రత్తంగా వైద్యం అందించాలని సూచించారు. క్రిటికల్ కేసులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏదైనా సమస్యలు ఎదురైనప్పుడు ఐక్యమత్యంగా సంఘంలోనే పరిష్కారం చేసుకోవాలని సూచించారు. స్థానిక ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా, ఆర్ఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు ఇబ్రహీం, ఉపాధ్యక్షుడు సురేందర్, నాయకులు జావీద్ అలీఖాన్, సంఘం సభ్యులు మెడికల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## రోడ్డుకు మరమ్మతులు



రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న పోలీసులు

లింగాపూర్,జనవరి 28: మండలంలోని పిట్టగూడ వాగు సమీపంలో ఎస్ఐ కొట్టె ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రధాన రహదారికి మరమ్మతులు చేయించారు. జైనూర్ నుంచి లింగాపూర్ మండల కేంద్రానికి వచ్చే ప్రధాన రహదారి పిట్టగూడ బ్రిడ్జి వద్ద వానకాలం వరద నీటితో కొట్టుకుపోయింది. దీంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. ఈ రహదారి పై వెళ్లే వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో ఎక్స్‌కవేటర్‌రతో గుంతలను పూడ్చివేశారు. ఎస్ఐతో పాటు సిబ్బంది ఉన్నారు.

# పెట్టుబడులు తగ్గించేలా.. దిగుబడులు పెంచేలా..

- ప్రకృతి వ్యవసాయం పై రైతులకు నిర్దేశం
- పైలెట్ ప్రాజెక్టుగా ఐటీడీఏ ఏజెన్సీ ప్రాంతం
- రాయితీలనందిస్తూ వివిధ పంటల సాగుపై సలహాలు, సూచనలు చేస్తున్న అధికారులు



కుమ్రం భీం ఆసిఫాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): వ్యవసాయంలో ఎక్కువ దిగుబడులు సాధించాలనే ఆశలో రైతులు పంటపొలాల్లో హానికర రసాయనాలు, ఎరువులను వినియోగిస్తున్నారు. దీంతో పెట్టుబడులు పెరిగిపోతుండగా, దిగుబడులు మాత్రం ఆశించిన స్థాయిలో రావడం లేదు. దీంతో రైతులు తీవ్రస్థాయిలో నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో పెట్టుబడులు లేని ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను మళ్లించేందుకు ఐటీడీఏ చర్యలు చేపట్టింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన రైతులను ఎంపిక చేసి వారి చేత 'ప్రకృతి వ్యవసాయం' చేయించేందుకు సన్నాహాలు చేస్తోంది. దీనికి కావాల్సిన శిక్షణను 500 మంది రైతులకు అందిస్తున్నది.

### పెట్టుబడి భారాన్ని తగ్గించేలా..

రైతులపై వ్యవసాయ పెట్టుబడుల భారాన్ని తగ్గించేందుకు రైతు బంధు, సబ్సీడీ విత్తనాలు, ఎరువులు అందజేస్తున్నది. ఆయిల్ పామ్ తోట, ఉద్యానవనాలు ప్రత్యేక రాయితీల ద్వారా బిందు సేద్యం వంటి పరికరాలను సబ్సిడీపై అందజేస్తోంది. తక్కువ ఖర్చుతో సాగయ్యే పంటలను ప్రోత్సహించేందుకు అనేక పథకాలను రాయితీలతో అమలు చేస్తోంది. రైతులను స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రోత్సహిస్తున్నది. ప్రకృతి సేద్యంలో రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం ఏమాత్రం ఉండదు. సహజసిద్ధమైన విత్తనాలతోనే ఈ వ్యవసాయం చేయాల్సి ఉంటుంది.జిల్లాలో ఎక్కువ శాతం రైతులు పత్తి, సోయా వంటి వాణి జ్య పంటను మినహాయిస్తే జొన్న, మక్క పంటలను సహజ సిద్ధంగానే సాగుచేస్తున్నారు. పత్తి, వరి, సోయా, కూరగాయలు సాగు చేసే రైతులు రసాయన ఎరువులు, పురుగుల మందులు అధికంగా వినియోగిస్తున్నారు. దీంతో పెట్టుబడులు పెరిగిపోతున్నాయి. దీంతో ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను నడిపించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది.



వంజిరిలో బాధితుడికి చెక్కు అందిస్తున్న అధికారులు, ఎమ్మెల్యే

# బాధితులకు భరోసా

- పులిదాడిలో పశువులను నష్టపోయిన వారికి నష్ట పరిహారం అందజేత
- తాజా ఘటనలతో దిద్దుబాటు చర్యలు చేపట్టిన అటవీ శాఖ

కుమ్రం భీం ఆసిఫాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): అటవీ శాఖ ఎట్టకేలకు నష్టనివారణ చర్యలు చేపట్టింది. అడవుల్లో పులులు, చిరుతల దాడుల్లో చనిపోయిన పశువులకు సంబంధించిన బాధితులకు నష్టపరిహారం అందిస్తున్నది. ఇటీవల జరిగిన ఘటన నేపథ్యంలో అటవీ శాఖ దిద్దుబాటు చర్యలకు దిగింది. జిల్లాలో పులుల దాడుల్లో ఎన్ని పశువులు చనిపోయాయనే విషయాన్ని అటవీ అధికారులు లెక్కిస్తున్నారు. నష్టపోయిన బాధితుల వివరాలను సేకరిస్తున్నారు. జిల్లాలో రూ. 17 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకు నష్టపరిహారం అందించాల్సి ఉందని జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ టిబ్రియాల్ 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. నష్టపరిహాన్ని అందించడంతో పాటు గిరిజనులకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

అటవీ సమీప గ్రామాల్లో నవంబర్ నుంచి ఫిబ్రవరి మధ్య పులుల దాడులు ఎక్కువగా జరుగున్నాయి. మేత కోసం పశువులను అడవులకు తీసుకువెళ్లడం, అటవీ ఉత్పత్తుల సేకరణ కోసం అడవులకు వెళ్లడంతోనే గిరిజనుల జీవనం కొసాగుతుంది. అడవుల్లో పులుల సంచారం ఇప్పుడు వీరికి ఇబ్బందికరంగా మారింది. పులి దాడిలో ఇప్పటి వరకు ముగ్గురు ఆదివాసీలు చనిపోయారు. ఇక పశువులు వందల సంఖ్యల్లో ఉన్నాయి. ఈ క్రమంలోనే ఇటీవల పులులపై విషహారం చేసినట్లు అధికారులు గుర్తించారు. ఇక ఇటీవల వాంకిడి, కాగజ్‌నగర్‌లో బాధితులకు నష్టపరిహారం అందించారు. అదేవిధంగా వన్యప్రాణులను చంపితే విధించే శిక్షలపై వారికి అవగాహన కల్పిస్తున్నారు.

### బాధితులకు పరిహారం అందిస్తాం

జిల్లాలో పులుల దాడుల్లో పశువులు చనిపోయి నష్టపోయిన బాధితులకు పరిహారాన్ని అందిస్తాం. పులుల దాడుల్లో పశువులు చనిపోతే వెంటనే అటవీ అధికారులకు సమాచారం ఇవ్వాలి. పశు వైద్యాధికారితో బాధితుడికి జరిగిన నష్టాన్ని అంచనావేసి పరిహారాన్ని అందిస్తాం. వన్యప్రాణులకు మాత్రం ఎలాంటి ఇబ్బంది కలిగించొద్దు.

**- నీరజ్ టిబ్రియాల్, జిల్లా అటవీ శాఖ అధికారి**

# జంగుబాయికి ప్రత్యేక పూజలు

తిర్యాణి,జనవరి 28: మండలంలోని పావనమడుగు గంగ వద్ద పుణ్య స్నానాలు ఆచరించి జంగుబాయి అమ్మవారి ఆలయం వద్ద జంగో,లింగో దీక్షా పరులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి నైవేద్యాలను సమర్పించారు. ఏటా భక్తులు పుష్యమాసం అమావాస్యను పురస్కరించుకుని దీక్షలు చేపట్టి, ఫిబ్రవరిలో అమావాస్య రోజున కెరమెరి మండలంలోని కోట పరందోలిలోని జంగుబాయి ఆలయం వద్ద విరమణ చేయడం ఆనవాయితీగా వస్తున్నది. సుమారు 200 మంది భక్తులు మాలధారణ తీసుకున్నట్లు గురుస్వామి నైతం మాధవరాజ్ మహరాజ్, భీంరావు తెలిపారు.



ఆలయానికి నైవేద్యంతో వెళ్తున్న జంగుబాయి భక్తులు

సిర్పూర్(యు), జనవరి 28: మండలంలో మహాగావ్ పటేల్ గూడ గ్రామంలో జంగో లింగో ఘన్ సంస్థాన్ ప్రధాన కార్యదర్శి గేడాం జగ్జీవన్ ఆధ్వర్యంలో జంగో లింగో దేవుడి అదివారం ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి జంగు బాయి దీక్షా పరులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించి, వివిధ రకాల నైవేద్యాలు సమర్పించారు. భక్తులు ఆత్రం దత్తు, గొడాం శె డ్మరావ్, సలాం ప్రభాత్ రావ్, గొడాం రొహిదాస్, ఉయి క సుంగు తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద దేవుడి ఉత్సవాలు



మొక్కుతున్న సెడ్మకి వంశీయులు

సిర్పూర్(యు) జనవరి 28: మండలంలోని ఖాతిగూడ గ్రామంలో సెడ్మకి వంశీయుల పెద్ద దేవుడి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం వారి పెద్ద దేవుడికి ప్రత్యేక పూజలు చేశారు. వంశీయుల కటోడ సెడ్మకి గంగారం మాట్లాడుతూ ఏటా ఈ ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. రెండో రోజు శోభాయాత్ర, మూడో రోజు ఆలీగూడ బుగ్గ క్షేత్రంలో గంగా స్నానానికి తీసుకెళ్తామని చెప్పారు. ప్రత్యేక పూజలతో పాటు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లిస్తామని చెప్పారు. వంశీయుల పటేల్ సెడ్మకి జగ్గేరావ్, వంశీయులు బాపురావ్, సుకంత్‌రావ్, గణపత్ రావ్, గుల్వంత్‌రావ్ ఉన్నారు.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ బండ కృష్ణమూర్తి

## క్రికెట్ పోటీలు ప్రారంభం

దహెగాం,జనవరి 28: మండలంలోని బీబ్రా గ్రామంలో బండ భవాని స్మారక క్రికెట్ పోటీలను సర్పంచ్ బండ కృష్ణమూర్తి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వదిన బండ భవాని జ్ఞాపకార్థం ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని కోరారు. గెలిచిన జట్లకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బండ కృష్ణమూర్తి, క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### సిర్పూర్(యు)లో..

సిర్పూర్(యు) జనవరి 28: మండలంలోని నేట్నూర్ గ్రామంలో జై ఆదివాసీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం క్రీడా పోటీల కర పత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా జై ఆదివాసీ యూత్ అధ్యక్షుడు ఆత్రం చతుర్రావ్ తమ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించే క్రీడా పోటీలు వచ్చే నెల 1 వ తేదీ నుం చి 3 వ తేదీ వరకు కొనగుతాయన్నారు. క్రీడాకారులు ఒక్కో జట్టుకు రూ.301 ఎంట్రీ ఫీజు ఉంటుందన్నా రు. ఈ క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి మెదటి బహుమతి రూ. 30,001, రెండో బహుమతి రూ.20,001, మూడో బహుమతి రూ. 10,001, నాలుగో బహుమతి రూ. 5001 నగదు రూపంలో క్రీడాకారులకు అందజేస్తామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఒకరోజు ముందే తమ జట్ల పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. సభ్యులు మెస్రం రమేశ్, మడావి జ్యోతిరాం, ఆడా శంభు, మడావి బు చ్చిరాం, ఆడా రవి ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

**WANTED**

★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. 9640468899 / 9640258899.
NT-319424-AII

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

## హడలెత్తిస్తున్న వీధి కుక్కలు



వీధుల్లో కుక్కల స్వైరవిహారం

వాంకిడి,జనవరి 28: మండల కేంద్రంలోని అన్ని వార్డుల్లో,వీధుల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి.గుంపులు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. కుక్కలే అనుకొని పక్కనుంచి వెళ్దామనుకుంటే, ఎక్కడ దాడి చేస్తాయోనని చిన్నారులు, పెద్దలు జంకుతున్నారు. కుక్కల గుంపు రోడ్లనే ఆవాసంగా మార్చుకుంటున్నాయి. దీంతో వాహనదారులు, ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి. కార్లు, ద్విచక్ర వాహనాలను వెంబడిస్తూ ప్రమాదాలకు గురిచేస్తున్నాయి.గ్రామపంచాయతీ అధికారులు స్పందించి కుక్కలను వేరే ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ప్రతిభకు పదును పెట్టేందుకే పరీక్షలు



టాలెంట్ టెస్ట్ పరీక్షా పత్రాలను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ సురేశ్

ఆసిఫాబాద్, జనవరి28: విద్యార్థుల్లో ప్రతిభకు పదును పెట్టేందుకు టాలెంట్ టెస్ట్ నిర్వహించినట్లు పీటీజీ ప్రిన్సిపాల్ సురేశ్ తెలిపారు. పీటీజీ పాఠశాలలో విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఆదివారం టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, పీటీజీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సురేశ్, ఓయూ జేఏసీ నాయకుడు వైరగడే రాజ్ కుమార్ ప్రశ్నాపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టేందుకు, ప్రతిభను వెలికి తీసేందుకు ఇటువంటి పరీక్షలు నిర్వహించడం అభిందనీయమన్నారు. ఆదివాసీల్లో ఉన్న మూఢ నమ్మకాలు పోగొట్టేందుకు కృషి చేయాలని సూచించారు. తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్ మాట్లాడుతూ టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులకు స్కూల్ మేనేజ్‌మెంట్లకు ధన్యవాదాలు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు పాఠశాల స్థాయిలో అభినందన సభ నిర్వహించి మెమోంటోలు అందజేస్తామని వివరించారు.డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గేడాం టీకానంద్, జిల్లా కోశాధికారి దుర్గం రాజ్ కుమార్, గర్ల్స్ కన్వీనర్ చాపిడే శ్రావణి పాల్గొన్నారు.

### ఓపెన్ ఇంటర్ తరగతులు ప్రారంభం

కాగజ్‌నగర్‌టౌన్ , జనవరి 28: పట్టణంలోని జడ్పీఎస్ఎస్ బాలుర పాఠశాల సరిసిల్క్‌లో ఆదివారం ఓపెన్ ఇంటర్ తరగతులు ప్రారంభమైనట్లు సెంటర్ కో ఆర్డినేటర్ ప్రమీల, అసిస్టెంట్ కోఆర్డినేటర్ సాయిని సత్యనారాయణ తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఓపెన్ ఇంటర్‌లో అడ్మిషన్ తీసుకున్న విద్యార్థులు ఈ తగతులను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ప్రతి ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి తరగతులు ప్రారంభం అవుతాయన్నారు. విద్యార్థులందరూ హాజరవ్వాలని కోరారు.

# అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్

ఆసిఫాబాద్, జనవరి 28: ఉచిత కంప్యూటర్ శిక్షణను విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్టీ పోస్ట్‌మెట్రిక్ వసతి గృహంలో పీఎంకేవీవై ఆధ్వర్యంలో అందించే ఉచిత కంప్యూటర్ శిక్షణపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యువత కోసం ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత కోసం ఉచిత కంప్యూటర్ విద్య, స్పోకెన్ ఇంగ్లిష్, స్కిల్ డెవలప్‌మెంట్ తదితర వాటిపై ఉచిత శిక్షణ అందించి కొన్ని కంపెనీల ద్వారా యువతకి ఉద్యోగావకాశాలు కల్పించే విధంగా ప్రోత్సాహం అందించడం జరుగుతుందన్నారు. ఇలాంటి అవకాశాలను విద్యార్థులు, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పీఎంకేకే అధ్యాపకులు దుర్గం నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిడాం గణపతి



ఆలయం వద్ద భక్తులు



నృత్యాలు చేస్తున్న భక్తులు

# వైభవంగా వనజాతర

- జంగుబాయి, కప్లై, సిద్ధికసలో భక్తజనం

కెరమెరి, జనవరి 28: మండలంలోని కోట పరందోలి భీడ్‌వార్ ప్రాంతంలోని మహరాజ్‌గూడ అడవుల్లో జంగుబాయి అమ్మవారిని దర్శించేందుకు భక్తులు పోటెత్తుతున్నారు. మరో వైపు శంకర్‌లొద్ది అడవుల్లో భీమదేవున్ని కప్లై గుహలతో పాటు సిద్ధికసలోని శివలింగం వద్ద భక్తుల తాకిడితో ఆలయాలు కిటకిటలాడుతున్నాయి. పుష్యమాసం వేడుకలు వచ్చే నెల 8న ముగుస్తుండడంతో భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. తెలంగాణతో పాటు ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రాల నుంచి ఆదివాసీ భక్తులు తరలిరావడం కనిపించింది. ఆదివాసీల సంప్రదాయ వాయిద్యాలతో అడవులు మారుమోగుతున్నాయి. ఎవరికి వారు తమ బృందాలతో తరలివ చ్చి గుహలను దర్శించి ఆరాధ్యదేవతలకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటున్నారు. జంగో లింగో దీక్ష తీసుకున్న భక్తులు కప్లై వద్ద పుణ్య స్నానాలు ఆచరించి, సిద్ధికస శి వలింగాన్ని దర్శించుకుంటున్నారు. ప్రస్తుతం ఈ అటవీ ప్రాం తాలు భక్తులతో జనసంద్రంగా మారాయి.

## కల్లాలు రద్దు చేయడం సరికాదు

కాగజ్‌నగర్‌టౌన్ , జనవరి 28: తునికాకు సేకరణ కల్లాలను రద్దు చేయడం సరికాదని బీఎస్పీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిడాం గణపతి అన్నారు. ఆదివారం బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నివాసంలో ఆయన మాట్లాడుతూ సిర్పూర్ ని యోజకవర్గంలోని ఫారెస్టు అధికారులు టైగర్ జోన్ అనే సాకుతో ఏడు తునికాకు కల్లాలను రద్దు చేస్తామని చెప్పడం సరికాదని పేర్కొన్నారు. దీంతో చాలా మంది జీవనోపాధికి ఆటంకం కలుగుతుందని, వెంటనే అధికారులు కల్లాల రద్దు నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. లేకుంటే బీఎస్పీ రాష్ట్రాధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో బీఎస్పీ పార్టీ జిల్లా అధ్యక్షుడు లెండుగురె శ్యామ్‌రావు, నాయకులు నక్క మనోహర్, ఆవుల రాజ్‌కుమార్ యాదవ్, నిర్మల, శ్యామ్‌రావు, శ్రీనివాస్, రాజు, తదితరులు పాల్గొన్నారు.



శేకుగూడలో నిర్మించిన పల్లె ప్రకృతి వనం

## పల్లె ప్రకృతి వనం.. నిర్వహణ అధ్వానం

ప్రజలకు ఆహ్లాదం అందించే లక్ష్యంతో నార్నూర్, గాదిగూడ మండలాల్లోని 48 గ్రామ పంచాయతీల పరిధిలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాల నిర్వహణ అధ్వానంగా మారింది. కలుపు, పిచ్చిమొక్కలకు ఆవాస కేంద్రాలుగా మారాయి. అధికారులు వాటిని తొలగించే చర్యలు చేపట్టడం లేదు. నాటిన మొక్కలు ఎండిపోయాయి. ఇప్పటికైనా మండల శాఖ ఉన్నతాధికారులు, పంచాయతీ కార్యదర్శులు స్పందించి పల్లె ప్రకృతి వనాలను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

-నార్నూర్, జనవరి 28


## వాలీబాల్ ,కబడ్డీ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్, జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు

చింతలమానేపల్లి, జనవరి 28: మండలంలోని బాబాసాగర్ గ్రామంలో స్వర్గీయ సయ్యద్ సాబీర్ హుస్సేన్ స్మారక నియోజకవర్గ స్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలను ఎమ్మెల్సీ దండె విఠల్, జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. ఎంపీపీ డుబ్బుల నానయ్య, జడ్పీటీసీ డుబ్బుల శ్రీదేవి, కో ఆప్షన్ సభ్యుడు నాజీమ్ హుస్సేన్, ఎంపీటీసీ జాబరి రాజయ్య, ఉప సర్పంచ్ భాస్కర్, నాయకులు డుబ్బుల వెంకయ్య, భీంకరి నారాయణ, తోంర్రే మారుతి, మహేశ్, పోశన్న, సంతోష్, రవీందర్, రాఘవ రెడ్డి, సంతోష్‌గౌడ్, శ్రీనివాస్, అజీమ్ హుస్సేన్, చౌదరి ప్రవీణ్, జాడి ఆకాశ్, యువకులు, క్రీడాకారులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో సమ్మక్క సందడి



గోలేటి లో మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

రెబ్బెన, జనవరి 28: మండలంలోని పలు గ్రామాల్లో ఫిబ్రవరిలో జరిగే సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా ఆదివారం సందడి నెలకొంది. ముఖ్యంగా సింగరేణి ప్రాంతం గోలేటిటౌన్‌షిప్‌లో సమ్మక్కకు నిలువెత్తు బెల్లం సమర్పించుకొని మొక్కులు చెల్లించుకుంటున్నారు. దుకాణాల వద్ద తులాభారం వేయిస్తున్నారు. ఇండ్లలో ఇరుగుపొరుగును పిలిచి, విందు పెడుతున్నారు.

## ఉచిత గ్యాస్ కనెక్షన్ అందజేత

ఆదిలాబాద్ రూరల్, జనవరి 28: ఆదిలాబాద్‌లోని 34వ వార్డు శాంతినగర్‌లో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి వకుళాభరణం వేదవ్యాస్ ఆదివారం 40 కుటుంబాలకు ప్రధాన మంత్రి ఉజ్వల్ పథకం కింద ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందజేశారు. నాయకులు అజయ్, భూమన్న, ప్రవీణ్, ప్రశాంత్ పాల్గొన్నారు.